క్లుప్తంగా

తోడేరులో ఓటు వేయనున్న కాకాణి

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం తన స్వగ్రామం తోడేరులో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కుటుంబ సభ్యులతో హాజరై ఓటు హక్కును వినియోగించుకుంటారు.

ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ తనిఖీ



విద్యుత్ సరఫరాపై అధికారులతో చర్చిస్తున్న ఎస్‌ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సోమవారం ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ విజయన్ ఆదివారం తనిఖీ చేశారు. నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో కోవూరు నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌లో విద్యుత్ సరఫరా ఏర్పాట్లను ఎస్‌ఈ తనిఖీ చేసి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని పోలింగ్ బూత్‌ల్లో విద్యుత్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఆయా ప్రాంతాల విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్‌ల ఫోన్‌నంబర్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఎదురైనా, ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన విద్యుత్ కాల్‌సెంటర్ల ఫోన్‌నంబర్లకు తెలియజేయాలని కోరారు. ఆయన వెంట నెల్లూరు టౌన్-2 విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ కృష్ణవేణి, సిబ్బంది ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

• సీఐ రవినాయక్



సంగం : మండల పరిధిలో సోమవారం జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్ కోన్నారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సిబ్బందితో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను తప్పక పాటించాలని కోరారు. రాజకీయ నాయకులు అధికారులకు సహకరించాలని కోరారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

గ్రామ స్వరాజ్యం.. సచివాలయాలతో సాకారం

• ఎక్కడికక్కడే సమస్యల పరిష్కారం
• ప్రజలకు పారదర్శక పాలన

సచివాలయాల్లోని పోస్టులు

1.సెక్రటరీ
2.గ్రేడ్-5 సెక్రటరీ
3.డిజిటల్ అసిస్టెంట్
4.వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్
5.సర్వే అసిస్టెంట్
6.విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్
7.ఆరోగ్య సహాయకులు
8.విలేజ్ రెవెన్యూ ఆఫీసర్(వీఆర్వో)
9.మహిళా పోలీస్
10.ఫిషరీస్ అసిస్టెంట్
11.ఎనర్జీ అసిస్టెంట్
12.ఇంజనీరింగ్ అసిస్టెంట్



ముత్తుకూరు మండలంలో సచివాలయాన్ని సందర్శించిన అధికారిణి (ఫైల్)

పొదలకూరు : జాతిపిత మహాత్మాగాంధీ గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలన్న సూక్తిని ఈ ప్రభుత్వం నిజం చేస్తూ గ్రామ, వార్డు సచివాలయాలను తీసుకొచ్చింది. ఎన్నో ఏళ్లుగా క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి నోచుకోని ప్రజల కలలను సాకారం చేస్తూ సచివాలయ వ్యవస్థ పనిచేస్తోంది. గ్రామ సరిహద్దు దాటకుండా అక్కడే ప్రజలకు కావాల్సిన అన్నిరకాల పనులు సచివాలయాలు చేసిపెడితున్నాయి. తద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి జనాలు మండల కేంద్రానికి రావడం తగ్గించారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే పరిస్థితి పూర్తిస్థాయిలో తప్పింది.

సాయంత్రం నుంచి అర్జీల స్వీకరణ

ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో సాయంత్రం 3 నుంచి అర్జీలు స్వీకరిస్తారు. సచివాలయ సిబ్బంది ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు వారికి అవసరమైన 536 రకాల సేవలను అందిస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వీలైనంత త్వరగా సర్టిఫికెట్లను అందజేస్తున్నారు. సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు వినతులను స్వీకరిస్తారు.

వలంటీర్లతో సమన్వయం

గ్రామ, వార్డు వలంటీర్లతో సచివాలయ ఉద్యోగులు సమన్వయం చేసుకుని పనిచేస్తున్నారు. వలంటీర్లు ఆయా సచివాలయాల్లో కొత్త పింఛన్లను ఆన్‌లైన్లో పొందుపరచడం, వివిధ రకాల సర్టిఫికెట్ల వివరాలను తెలియజేయడం, ఇల్లు లేనివారికి జగనన్న కాలనీలో ఇంటి నివేశనా స్థలంతో పాటు, పక్కా ఇల్లు మంజూరు తదితర వివరాలను సచివాలయాల్లో పొందుపరుస్తారు.



పొదలకూరు బిట్-1 సచివాలయం

మండలాల వారీగా సచివాలయాలు	
పొదలకూరు	23
ముత్తుకూరు	16
టీపీ గూడూరు	16
వెంకటాచలం	20
మనుబోలు	14

సర్వేపల్లి నియోజకవర్గంలో..	
సచివాలయాల సంఖ్య	91
కేటాయించిన నిధులు	రూ.36.40 కోట్లు
సచివాలయాల పరిధిలోని ఇళ్లు	88,362
సచివాలయంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య	12
సచివాలయాల ద్వారా అందే సేవల సంఖ్య	536



టీపీ గూడూరు మండలం నరుకూరు సచివాలయ భవనం



బ్రహ్మదేవి సచివాలయ భవనం



వైద్యరంగంలో నర్సుల పాత్ర కీలకం



నర్సులకు సత్కారం

కోవూరు : వైద్యరంగంలో నర్సుల పాత్ర ఎంతో కీలకమని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ విజేత తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పనిచేస్తున్న 15 మంది నర్సులను ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం నరసింహమూర్తి మాట్లాడుతూ.. ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల నర్సులు చూపుతున్న ప్రేమానురాగాలు మరువలేనివన్నారు. తొలుత నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.

రామానుజాచార్యుల జీవితం ఆదర్శప్రాయం

నెల్లూరు(బృందావనం): భగవద్రామానుజాచార్యుల జీవితం ఆదర్శప్రాయమని సామాజిక సమరసత వేదిక జిల్లా నిర్వాహకుడు కోడూరు సత్యం తెలిపారు. జిల్లా సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో రంగనాయకులపేటలోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం సమీపంలో ఉన్న రామానుజాచార్యుల విగ్రహం వద్ద ఆదివారం భగవద్రామానుజాచార్యుల జయంతిని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొలుత రామానుజాచార్యుల విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో ఆ సంస్థ నిర్వాహకులు లక్ష్మీనారాయణ, ఎం.శ్రీనివాసులు, డి.రాజేంద్ర, జయప్రకాష్, సతీష్, మల్లికార్జున, జి.కేశవులు తదితరులు పాల్గొన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు రమాదేవి ఆధ్వర్యంలో రామానుజాచార్యుల జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రంగనాయకులపేటలోని రామానుజాచార్యుల విగ్రహానికి పూలమాల వేసి ప్రణమిల్లారు.

ఆదిశంకరాచార్యులకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో ఆదిశంకరాచార్యులు

పొదలకూరు : జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను స్థానిక కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీగాయత్రి ఉపాసక బ్రాహ్మణ సేవాసంఘం వారు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదిశంకరాచార్యులు బాల్యంలోనే సన్యాసం స్వీకరించి హైందవ ధర్మప్రచారానికి భారతదేశమంతా నాలుగు పర్యాయాలు పర్యటించినట్లు తెలిపారు. అద్వైత సిద్ధాంతాన్ని బోధించడమే కాకుండా దేశానికి నలువైపులా చతురామ్నాయ పీఠాలను స్థాపించినట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ప్రసాద్‌స్వామి, శివస్వామి, సేవాసంఘం బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాను అరికట్టాం

• సెబ్ సీఐ రవీంద్ర

ఆత్మకూరు : ఆత్మకూరు సర్కిల్ పరిధిలో మద్యం అక్రమ రవాణాను, నిల్వలను అరికడుతున్నట్లు సెబ్ సీఐ కె.రవీంద్ర తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలైనప్పటి నుంచి 25 రోజుల వ్యవధిలో 49 మద్యం కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లో 47 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 1,002 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. 78 మందిని బైండోవర్ చేసినట్లు తెలియజేశారు.

కనులపండువగా శ్వేతఛత్ర ఉత్సవం

• శ్రీతల్పగిరి రంగనాథునికి విశేష తిరుమంజనం



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవీ భూదేవీ సమేత రంగనాథస్వామి

నెల్లూరు(బృందావనం): నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో శ్రీభగవద్రామానుజాచార్యుల తిరునక్షత్రం సందర్భంగా ఆదివారం బంగారు పల్లకిలో శ్వేతఛత్ర ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం మంగళాశాసనోత్సవం జరిగింది. తదుపరి ఆలయ అర్చకులు శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామికి, శ్రీభగవద్రామానుజాచార్యులకు శాస్త్రోక్తంగా విశేష తిరుమంజనం నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు పెద్ద శేషవాహన ఉత్సవం, శ్రీభగవద్రామానుజాచార్యులకు ఉడయవర్లు తిరిచ్చిలో పేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో శంకరాచార్యుల జయంతి



నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులు, కళాకారులు

• ఉచితంగా ఉపనయనాలు



ఉపనయనం చేసిన బాలునితో సంఘ కార్యవర్గ సభ్యులు

ఆత్మకూరు : పట్టణంలోని విశ్వేశ్వరాలయంలో ఆది గురువు శంకరాచార్యుల జయంతిని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ బాలురకు శివాలయ ప్రాంగణంలో ఉచితంగా ఉపనయనాలు నిర్వహించారు. తొలుత ఏపీ అర్చక పురోహిత సంఘం ఉపాధ్యక్షుడు శివకుమార శర్మ నేతృత్వంలో విశ్వేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు గావించారు. అనంతరం ప్రత్యేక వేదికపై శంకరాచార్యుల చిత్రపటం ఉంచి పూజలు జరిపించారు. సర్వదేవతా హోమం అనంతరం ఉపనయనాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీభారతి సంగీత నృత్య విద్యాలయ కళాకారులు చేపట్టిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సీమ బ్రాహ్మణసేవా సంఘం కార్యవర్గ సభ్యులు వాకాటి మురళీశర్మ, చంద్రశేఖరశర్మ, చక్రవర్తి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న ఓ హోటల్‌లో రెడ్ల ఐక్య వేదిక సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. తొలుత ఇటీవల మృతిచెందిన జేఎస్ రెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులైన రెడ్డి సంఘీయులు, కళాకారులు, కవులు, రచయితలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అలాగే ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో 591 మార్కులు సాధించిన నెల్లూరుకు చెందిన ఊటుకూరు చరణ్‌కుమార్‌రెడ్డికి ప్రోత్సాహకంగా వెందోటి ధనుంజయరెడ్డి రూ.50 వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో రెడ్ల ఐక్యవేదిక నిర్వాహకులు నిర్మల నరసింహారెడ్డి, డాక్టర్ బీవీ రెడ్డి, హైటెక్ రమణారెడ్డి, వెందోటి ధనుంజయరెడ్డి, సంఘమిత్ర రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

• విధులను బాధ్యతగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచన



వెంకటాచలం : క్యూబా ఇంజనీరింగ్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

వెంకటాచలం : సర్వేపల్లి నియోజకవర్గంలో సోమవారం జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు పక్కాగా పూర్తి చేశారు. నియోజకవర్గంలో 284 పోలింగ్ కేంద్రాలుండగా 1,12,782 మంది పురుషులు, 1,19,189 మంది స్త్రీలు, ఇతరులు 26 మంది కలిపి మొత్తం 2,31,997 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల బరిలో మొత్తం 13 మంది అభ్యర్థులు ఉన్నారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. నియోజకవర్గ పరిధిలోని 284 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2,566 మంది ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికల విధులు చేపట్టనున్నారు. ఆదివారం ఉదయం నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలంలోని క్యూబా ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ హరినారాయణన్ పరిశీలించి ఉద్యోగ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలను కేటాయించిన ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందజేశారు. సాయంత్రంలోగా అన్ని కేంద్రాలకు ఎన్నికల సామగ్రి, ఉద్యోగులు చేరేలా బస్సులు ఏర్పాటు చేశారు. ఎన్నికల విధులకు సంబంధించి అన్ని విషయాలపై అవగాహన కల్పించారు.

బాధ్యతగా విధులు చేపట్టాలి – ఆర్వో చిన్న ఓబులేసు

ఎన్నికల విధులను అధికారులు, సిబ్బంది బాధ్యతగా చేపట్టాలని సర్వేపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్న ఓబులేసు సూచించారు. వెంకటాచలంలోని క్యూబా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తమ విధులు నిర్వర్తించాలని తెలియజేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా వ్యవహరించాలని సూచించారు. బస్సుల ద్వారా అన్ని పోలింగ్ కేంద్రాలకు సకాలంలో ఎన్నికల సామగ్రి చేరేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశామని తెలియజేశారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కుకు ఉన్న విలువ గురించి ఓటర్లకు అవగాహన కల్పించామని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలియజేశారు. అలాగే ఎన్నికల విధులకు హాజరయ్యే పోలీస్ ఉద్యోగులతో డీఎస్పీ వీరాంజనేయరెడ్డి సమావేశం నిర్వహించి, విధి నిర్వహణలో అలసత్వం చూపకుండా వ్యవహరించాలని సూచించారు.

సర్వం సిద్ధం

తోటపల్లిగూడూరు : లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మండల పరిధిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాధవరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ మండలంలోని 22 పంచాయతీల్లో 50 పోలింగ్ కేంద్రాల పరిధిలో 41,593 మంది ఓటర్లున్నారన్నారు. ఇందులో 20,046 మంది పురుషులు, 21,547 మంది మహిళా ఓటర్లున్నారన్నారు. సోమవారం జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 350 మంది ఎన్నికల సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. అందులో ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఓ పీఓ, మరో ఏపీఓతో పాటు ఐదుగురు పోలింగ్ అధికారులు ఉంటారన్నారు. అలాగే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 80 మందితో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామని వివరించారు. ఓ సీఐ, ఓ ఎస్సై, 78 మంది ఇతర పోలీస్ సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. మండలంలోని మండపం, వరకవిపూడి, చిన్నచెరుకూరు, వెంకన్నపాళెం, కొత్తపాళెం, కొత్తకోడూరు, పాతకోడూరు, మహాలక్ష్మీపురం, నెల్లిమిట్లకండ్రిగ, పొట్లపూడి, ఈదూరు పంచాయతీలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించినట్లు తెలియజేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పొదలకూరు : మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ మహ్మద్‌రఫీ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తాటిపర్తి, పొదలకూరు బూత్‌లను తనిఖీ చేసి సిబ్బంది ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సామగ్రి, ఈవీఎంలు, మాక్‌పోల్‌పై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ వెంట హౌసింగ్ ఏఈ శివమోహన్ తదితరులు ఉన్నారు.

20 పంచాయతీల్లో 62 కేంద్రాలు

ఇందుకూరుపేట : మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను మామిడాకులు, అరటి తోరణాలతో సుందరంగా తీర్చిదిద్దారు. మండలంలోని 20 పంచాయతీల పరిధిలో 62 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తహసీల్దార్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు, తాగునీటి వసతి, వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. మొత్తం 47,991 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



వెంకటాచలం : పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లే సామగ్రితో ఉద్యోగులు, సిబ్బంది



వెంకటాచలం : ఎన్నికల విధులకు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్న పోలీస్ సిబ్బంది



పొదలకూరు : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ